



# కరపత్రం

SINCE 2014

బుధవారం ఏప్రిల్ 8, 2026 సంపుటి : 2 సంచిక : 177 - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ పేజీలు :4




## యూరియా యాప్ పై హర్షం వ్యక్తం చేసిన రైతులు


- యూరియాను శాస్త్రీయంగా వాడాలి
- అధిక వాడకం వల్ల భూసారం తగ్గిపోతుంది
- మంత్రి తుమ్మల

**హైదరాబాద్,ఏప్రిల్7 :** దేశంలోనే అధికంగా యూరియా వాడుతున్న రాష్ట్రాలలో తెలంగాణ కూడా ఉందని, ఇది ఎంత మాత్రం ఆమోదయోగ్యం కాదని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. రైతులు యూరియాను అధికంగా వినియోగించవద్దని కోరారు. యూరియాను అధికంగా వాడటం వల్ల, నేల ఆరోగ్యం దెబ్బతినడంతో పాటు, రానురాను దిగుబడులు కూడా తగ్గుతాయని, చీడ పీడల సమస్యలు పెరుగుతాయని తెలిపారు. ఇప్పుడు పంటల కోతల సమయం వచ్చిందని, రైతులు కోతల అనంతరం వచ్చే పంట వ్యర్థాలను కాల్చవద్దని అన్నారు. పంట వ్యర్థాలను కాల్చడం ద్వారా పర్యావరణం దెబ్బతింటుందని తెలిపారు. ప్రతి మంగళవారం నిర్వహించే రైతునేస్తం కార్యక్రమంలో భాగంగా.. ఈ రోజు నిర్వహించి రైతునేస్తం కార్యక్రమంలో వ్యవసాయశాఖ మంత్రి సచివాలయం నుండి హాజరయ్యారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులతో ముఖాముఖి మాట్లాడిన మంత్రిగారు.. యూరియా యాప్ మరియు యూరియా వినియోగం వంటి అంశాలపై రైతుల అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రైతునేస్తం కార్యక్రమంలో రైతులు అధికంగా పాల్గొనేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రైతుల సందేహాలను నివృత్తి చేయడంతో పాటు, రైతులకు ఆధునిక వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమ లక్ష్యమని తెలిపారు. యూరియా యాప్ పై రైతుల అభిప్రాయాలను మంత్రి అడిగి తెలుసుకున్నారు. యూరియా యాప్ తో లైన్లలో నిలబడే బాధ తప్పిందని, ఇంట్లో నుంచే యూరియాను బుక్ చేసుకోని, ఉచిత సమయంలో తెచ్చుకునేందుకు వీలు కలిగిందని, దీంతో సమయం వృథా కాకుండా ఉందని రైతులు యూరియా యాప్ ని కొనియాడారు. భవిష్యత్తులో కూడా యూరియా యాప్ తోనే యూరియా అమ్మకాలు జరిగేలా చర్యలు తీసుకోవాలని మంత్రిగారిని రైతులు కోరారు.

2లో..

## మరింత పటిష్టంగా కాలేజీ విద్య

» రీ ఒరియెంటేషన్ చేయాలి
» డిమాండ్ ఉన్న కోర్సులపై దృష్టి సారించాలి
» యూనివర్సిటీల ర్యాంకింగులు పెరగాల్సిందే
» ప్రజలకు చేరువగా ప్రభుత్వ పథకాలు
» అధికారులతో సమీక్షలో సీఎం చంద్రబాబు ఆదేశం



2లో..

**అమరావతి,ఏప్రిల్7 :** కాలేజీ విద్యను మరింత పటిష్టంగా తీర్చిదిద్దాలని సీఎం చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా కాలేజీ విద్యను రీ-ఒరియేంటేషన్ చేయాల్సి ఉందని తెలిపారు. ఈ మేరకు అధ్యయనం చేయాలని, యూనివర్సిటీలతో నిత్యం అనుసంధానం చేసుకోవాలని సూచించారు. మంగళవారం ఆర్టీజీస్ నుంచి వివిధ శాఖల పనితీరుపై సీఎం సమీక్షించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ...ట్రెడిషన్ కోర్సులతో పాటు డిమాండ్ ఉన్న కోర్సులను, కొత్త కరిక్యులాన్ని ప్రవేశపెట్టేలా కసరత్తు చేయాలని నిర్దేశించారు. ఈ మేరకు కరికుల్యాన్ని రీ-స్ట్రక్చర్ చేసేలా చూడాలన్నారు. అలాగే యూనివర్సిటీల ర్యాంకింగులు కూడా మరింతగా పెరగాల్సి ఉందన్నారు.
ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యంగా తీసుకున్న పథకాలు, కార్యక్రమాలను పక్కా ప్రణాళికలతో అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులకు దిశానిర్దేశంచేశారు. ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరువ చేయడంతోపాటు.. సంతృప్తి కలిగించే రీతిలో సేవలు అందించినప్పుడే మంచి ఫలితాలు వస్తాయని పేర్కొన్నారు. నిర్దేశిరచుకున్న లక్ష్యాలను చేరుకునే విషయంలో ఎలాంటి జాప్యం జరగకూడదని ఆదేశించారు. ఈ ఏడాదిలో మరోసారి సామూహిక గృహ ప్రవేశాల కార్యక్రమం చేపట్టాలని నిర్ణయించుకున్నామని తెలిపారు. ఆ దిశగా గృహ నిర్మాణ శాఖ వేగంగా పనిచేయలని మార్గనిర్దేశర చేశారు. టిడ్కో ఇళ్లు కాకుండానే మరో 5 లక్షలకు ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేసి లబ్దిదారులకు అందించాలని ఆదేశించారు. ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేసే విషయంలో ఎక్కడా ఆలస్యం కాకూడదని సీఎం చంద్రబాబు దిశానిర్దేశర చేశారు. ఇప్పటి వరకు ఏ ప్రభుత్వం చేయని విధంగా తాము ఇళ్ల నిర్మాణం చేపడుతున్నామని వివరించారు. లబ్దిదారుల్లో సంతోషం వ్యక్తమవుతోందని.. ఇది కొనసాగాలని అన్నారు. ఇళ్ల నిర్మాణంతోపాటు ఇంటి స్థలాల పంపిణీ పక్రియను వీలైనంత త్వరగా ప్రారంభించాలని సూచించారు. సుమారు 2 లక్షల మంది ఇళ్ల స్థలాలు కోరినట్లు సర్వేలో తేలిందన్నారు.



2లో..

## బెంగాల్‌పై కన్నేస్తే.. పాక్ ముక్కలే

- పాక్ రక్షణ మంత్రి ఖవాజా వ్యాఖ్యలకు కౌంటర్
- రెచ్చగొట్టే ప్రకటనలై మండిపడ్డ రాజ్‌నాథ్ సింగ్

**న్యూఢిల్లీ,ఏప్రిల్7 :** పాకిస్థాన్‌కు రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ స్ట్రాంరగ్ వార్నింగ్ ఇచ్చారు. బెంగాల్‌పై కన్నేస్తే ఈసారి పాక్ ఎన్ని ముక్కలవుతుందో ఆ దేవుడికే తెలియాలంటూ హెచ్చరికలు చేశారు.

2లో..



## రేవంత్‌తో చర్చకు దిగే ఉద్దేశం లేదు
### పినరయి విజయన్

**తిరువనంతపురం:** తనతో చర్చకు రావాలన్న సీఎం రేవంత్‌రెడ్డి సవాల్‌పై కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ స్పందించారు. ఆయనతో చర్చకు దిగే ఉద్దేశం తనకు లేదన్నారు. రేవంత్‌తో చర్చకు దిగేందుకు తెలంగాణలో పార్టీలు ఉన్నాయని, ఆయన ప్రభుత్వ పనితీరుపై అక్కడి ప్రజలే తీర్పునివ్వాలని వ్యాఖ్యానించారు.

## ఐపీఎల్ పేరుతో ఆన్‌లైన్ బెట్టింగ్ మోసాలు

» బెట్టింగ్ యాప్ ఉచ్చులో పడకండి
» నగర పోలీస్ కమిషనర్ సజ్జన్నార్ హెచ్చరిక



2లో

**హైదరాబాద్,ఏప్రిల్7 :** ఐపీఎల్ మ్యాచ్‌ల పేరుతో ఆన్‌లైన్ బెట్టింగ్ మోసాలు పెరిగి పోతున్నాయని... ఈ ఉచ్చులో పడవద్దని హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్ సజ్జనార్ హెచ్చరిక జారీ చేశారు. ఆన్‌లైన్ బెట్టింగ్‌పై సామాజిక మాధ్యమం ఎక్స్‌లో సీపీ స్పందించారు. సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లలో ఫేక్ క్రికెట్ ప్రిడిక్షన్ ఛానెల్స్ దందా చేస్తున్నాయని.. టాస్, మ్యాచ్ ఫలితాలు ముందే చెబుతామని అమాయకులను బెట్టింగ్ ఉచ్చులోకి లాగుతూ మోసం చేస్తున్నాయని సీపీ తెలిపారు. ఇన్‌ఫ్లుయెన్సర్లు కూడా ఈ అసత్య ప్రచారాల్లో పాల్గొంటున్నారని అన్నారు. ఈ ఫేక్ ప్రిడిక్షన్ ఛానెల్స్.. ముందుగా ఎన్‌రోల్ చేయించి, తర్వాత బెట్టింగ్ యాప్‌ల లింకులు పంపి మోసం చేస్తున్నాయని సజ్జనార్ అన్నారు. బెట్టింగ్ వల్ల కష్టపడి సంపాదించిన డబ్బును అమాయకులు కోల్పోతున్నారని ఆయన చెప్పారు.

## ఆరు గ్యారెంటీలు 900 రోజులైనా ఏవీ

- పరిగిలో భూములు లాక్కునే యత్నం
- సిఎం రేవంత్‌పై విరుచుకుపడ్డ హరీష్ రావు
- పరిగి వెళుతున్న హరీష్ రావు తదితరుల అరెస్ట్
- శంషాబాద్ పోలీస్ స్టేషన్‌కు తరలింపు



2లో

**హైదరాబాద్,ఏప్రిల్7 :** పరిగిలో భూముల లాక్కొని తన సోదరుడికి కట్టబెట్టే ప్రయత్నం చేస్తున్నారంటూ సీఎం రేవంత్ రెడ్డిపై హరీశ్ రావు నిప్పులు చెరిగారు. 6 గ్యారెంటీలు 100 రోజుల్లో పూర్తి చేస్తామన్నారు.. 900 రోజులైనా ఎందుకు పూర్తి చేయలేదంటూ సీఎం రేవంత్ రెడ్డిని ఆయన సూటిగా ప్రశ్నించారు. ఈ మేరకు సీఎం రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ ఎమ్మెలే, మాజీ మంత్రి హరీశ్ రావు మళ్లీ నిప్పులు చెరిగారు. మంగళవారం శంషాబాద్ పోలీస్ స్టేషన్ వద్ద హరీశ్ రావు మాట్లాడుతూ.. రేవంత్ నువ్వు మళ్ళీ గెలవడం కాదు కదా ప్రతిపక్ష హోదా కూడా నీ పార్టీకి రాదని జోస్యం చెప్పారు. రాష్ట్రంలో ఎన్నికలు ఎప్పుడు జరిగినా కాంగ్రెస్ పార్టీ సింగిల్ డిజిట్‌కే పరిమితం అవుతుందని స్పష్టం చేశారు. ప్రభుత్వాన్ని ప్రతిపక్షాలు ప్రశ్నిస్తే అరెస్టులు చేస్తున్నారని చెప్పారు. పరిగిలో రైతులను పరామర్శించేందుకు వెళ్తుంటే తమను అరెస్టు చేశారని పేర్కొన్నారు. రేవంత్ రెడ్డి పాలన.. గడీల పాలన.. బేడీల పాలన.. గుడ్డి పాలన అంటూ హరీశ్ రావు అభివర్ణించారు. సాగుకు పనికిరాని భూముల్లో పరిశ్రమలు పెట్టండంటూ ప్రభుత్వానికి ఈ సందర్భంగా ఆయన సూచించారు.

## రైతుల భూములు లాక్కునే యత్నం దుర్మార్గం

- ఇండస్ట్రియ్ పార్క్ పేరుతో భూ దందా
- బిఆర్ఎస్ నేతలను నిర్బంధించడం దుర్మార్గం
- హరీష్ రావు తదితరుల అరెస్ట్‌పై కెటిఆర్ ఆగ్రహం



2లో..

**హైదరాబాద్,ఏప్రిల్7 :** ప్రశ్నించే గొంతులను పోలీసుల బలంతో నొక్కాలని చూడటం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమేనని బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. పరిగి నియోజకవర్గంలోని కాళ్లాపూర్, రాపోలు గ్రామాల్లో ఇండస్ట్రియల్ పార్క్ పేరుతో రైతుల నుంచి 1200 ఎకరాల భూమిని బలవంతంగా లాక్కోవడాన్ని కేటీఆర్ తీవ్రంగా తప్పుపట్టారు. అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రజలకిచ్చిన హామీలను గాలికొదిలేసి పేదల భూములపై పడిందని మండిపడ్డారు.

## ఐటీ కారిడార్ లో హైడ్రా భారీ ఆపరేషన్
### 12 వందల కోట్ల విలువైన 8 ఎకరాలు స్వాధీనం

**హైదరాబాద్,ఏప్రిల్7 :** ఐటీ కారిడార్ లో హైడ్రా భారీ ఆపరేషన్ నిర్వహించింది . మంగళవారం ఖానామెట్ లో రూ. 12 వందల కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని కబ్జా చెర నుంచి కాపాడింది. ఇందుకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి..




2లో

## తెలంగాణలో మావోయిస్టుల శకం ముగిసింది

- కర్రెగట్టుల్లో స్వేచ్ఛగా తిరిగే వెసలుబాటు
- మావోయిస్టు అడ్డాల్ఓ అభివృద్ధి పరుగులు
- రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి వెల్లడి




2లో..

**ములుగు,ఏప్రిల్7 :** తెలంగాణలో మావోయిస్టుల శకం ముగిసిందని డిజిపి శివధర్ రెడ్డి అన్నారు.ఒకప్పుడు తుపాకుల మోతతో, అశాంతితో నిండిన తెలంగాణ అటవీ ప్రాంతాల్లో ఇప్పుడు శాంతి గీతం వినిపిస్తోంది. దశాబ్దాల కాలంగా మావోయిస్టులకు అడ్డాగా ఉన్న ప్రాంతాల్లో ఇప్పుడు అభివృద్ధి పరుగులు తీస్తోంది.

## కాంగ్రెస్ కోసం సైనికుల్లా పనిచేయాలి

» బిఆర్ఎస్, బిజెపిలకు అధికారం కల్ల
» నాగర్ కర్నూలు కాంగ్రెస్ కార్యక్రంలో పిసిసి చీఫ్



మిగతాది 2లో

**నాగర్ కర్నూల్,ఏప్రిల్7 :** తెలంగాణలో కాంగ్రెస్ మళ్లీ అధికారంలోకి రావాలంటే సైనికుల్లా పని చేయాలని పార్టీ కార్యకర్తలకు పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ పిలుపునిచ్చారు. తెలంగాణలో బీఆర్ఎస్, బీజేపీలు అధికారంలోకి రావని ఆయన జోస్యం చెప్పారు. బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కావాలని బావా బామ్మర్దులు హరీశ్ రావు, కేటీఆర్ కొట్లాడుకుంటున్నారని విమర్శించారు.

## ఐపీఎల్ పేరుతో
# ఆన్‌లైన్ బెట్టింగ్ మోసాలు

మొదటిపేజీ తరువాయి
ఫేక్ ప్రిడిక్షన్‌లను ఎట్టి పరిస్థితుల్లోనూ నమ్మొద్దని సీపీ హెచ్చరించారు. ఫేక్ ప్రిడిక్షన్‌లు, బెట్టింగ్‌లపై హైదరాబాద్ సైబర్ క్రైమ్ విభాగం కఠిన చర్యలు తీసుకుంటుందని సీపీ తెలిపారు. ఇప్పటివరకు 494 పెయిడ్ యాడ్స్‌ను సైబర్ క్రైమ్ పోలీసులు బ్లాక్ చేశారని సీపీ చెప్పారు. సోషల్ మీడియాలో 129 ఫేక్ ప్రొ÷ళ్లను తొలగించారన్నారు. బెట్టింగ్ యాప్‌లపై నిరంతర నిఘా ఉంటుందని స్పష్టం చేశారు. మోసపూరిత యాడ్స్ కనిపిస్తే వెంటనే రిపోర్ట్ చేయాలని ప్రజలను సీపీ కోరారు. సైబర్ మోసం జరిగితే వెంటనే 1930కి ఫోన్ చేయాలని లేదా ఞాశిసఞసతిపు.ఐనీల.తిని వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేయాలని సీపీ సజ్జనార్ పేర్కొన్నారు.

## ఆరు గ్యారెంటీలు 900 రోజులైనా ఏవీ

మొదటిపేజీ తరువాయి
ఎస్సీ, ఎస్టీ రైతులు సాగు చేసుకుంటున్నా భూములను ఎందుకు లాక్కుంటున్నారంటూ ప్రభుత్వాన్ని సూటిగా ఆయన ప్రశ్నించారు. మీ పాలన అంతా బోగస్ మాటలు.. బోగస్ పాలన అంటూ రేవంత్ పరిపాలనను ఎద్దేవా చేశారు. రేవంత్ రెడ్డికి మించిన రావణాసురుడు ఎవరైనా ఉన్నారా? అని ఈ సందర్భంగా హరీశ్ రావు ప్రశ్నించారు. రామరాజ్యం వస్తుంది.. కేసీఆర్ రాజ్యం వస్తుందని ఈ సందర్భంగా హరీశ్ రావు విశ్వాసం వ్యక్తం చేశారు. పరిగిలో రైతులకు మద్దతు తెలిపేందుకు వెళ్తన్న హరీశ్ రావుతో ఆయన అనుచరులను పోలీసులు అరెస్ట్ చేశారు. అనంతరం వారిని శంషాబాద్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. దాంతో హరీశ్ రావు పైవిధంగా స్పందించారు. పోలీసు నిర్బంధాలు, అణిచివేత చర్యల మధ్య వికారాబాద్ జిల్లా పరిగి రైతుల వద్దకు మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు బయల్దేరారు. మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, ఎర్రబెల్లి దయాకర్ రావు, మాజీ ఎమ్మెల్యేలు ఆల వెంకటేశ్వర రెడ్డి, దివాకర్ రావు, మాజీ చైర్మన్ ఎర్రోళ్ల దయాకర్‌రావుతో కలిసి ఆయన పరిగికి బయల్దేరారు. ఈ క్రమంలో మార్గమధ్యలో అప్పా జంక్షన్ వద్ద వారిని పోలీసులు అడ్డుకున్నారు.

పరిగికి చేరుకోకుండా హరీశ్‌రావును పోలీసులు అడ్డుకున్నారు. హరీశ్‌రావు కాన్వాయ్ ముందుకు వెళ్లకుండా లారీలను రోడ్డుకు అడ్డంగా పెట్టారు. రైతులకు భరోసాగా వెళ్తున్న హరీశ్‌రావును అరెస్టు చేసేందుకు యత్నించారు. అయితే పోలీసుల తీరును బీఆర్ఎస్ శ్రేణులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. ఈ క్రమంలో పోలీసులు, బీఆర్ఎస్ నాయకుల మధ్య తీవ్ర వాగ్వాదం నెలకొంది. బీఆర్ఎస్ శ్రేణులు రోడ్డుపై బైఠాయించిన ఆందోళన చేపట్టారు. దీంతో అప్పా జంక్షన్ వద్ద ఉద్రిక్తత నెలకొంది. అప్పా జంక్షన్ వద్ద అడ్డుకుని శంషాబాద్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఆయనతో పాటు మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, ఎర్రబెల్లి దయాకర్ రావును స్టేషన్‌కు తీసుకెళ్లారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి పాలన రాక్షస పాలనగా మారిందని విమర్శించారు. పరిగిలో అన్యాయానికి గురైన రైతులకు భరోసా ఇవ్వడానికి వెళ్తున్న మమ్మల్ని అడ్డుకొని, అన్యాయంగా అరెస్టులు చేస్తున్నారని మండిపడ్డారు. ఎక్కడికక్కడ దళిత, గిరిజన, బలహీనుల భూములు లాక్కుంటున్నారని అన్నారు. రాష్ట్రంలో పోలీసుల రాజ్యం నడుస్తుందని అన్నారు. కష్టాల్లో ఉన్న రైతులను పలకరించడానికి కూడా వెళ్లనివ్వడం లేదని ఆగ్రహం వ్యక్తంచేశారు.

# రైతుల భూములు లాక్కునే యత్నం దుర్మార్గం

మొదటిపేజీ తరువాయి
బీఆర్ఎస్ పార్టీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్స్ హరీశ్ రావు, సబితా ఇంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు కొప్పుల మహేశ్ రెడ్డి, నరేందర్ రెడ్డి, మెతుకు ఆనంద్, ఇతర నేతల అరెస్టులపై కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ భూమిని కాపాడుకోవాలని పోరాడుతున్న రైతులకు బాసటగా నిలిచేందుకు వెళ్తున్న బీఆర్ఎస్ నేతలను అక్రమంగా గృహనిర్బంధం చేయడం, అరెస్టు చేయడం కాంగ్రెస్ ప్రభుత్వ పిరికిపంద చర్య అని ఆయన అభివర్ణించారు. రైతు భరోసా, రుణమాఫీ, ఆరు గ్యారెంటీలు 420 హామీలను అమలు చేయకుండా రైతులను అరిగోస పెడుతున్న ప్రభుత్వం, ఇప్పుడు పరిశ్రమల పేరుతో భూ సేకరణకు దిగడం దుర్మార్గమని పేర్కొన్నారు. గత రెండున్నరేళ్లలో ఒక్క పరిశ్రమను కూడా తీసుకురాని ఈ సర్కార్, భూములను దోచుకోవడంలో మాత్రం విపరీతమైన ఆసక్తి చూపిస్తోందని మండిపడ్డారు. కాంగ్రెస్ నేతలు దొంగల్లా ఊళ్లు పంచుకుంటున్నట్లు భూములను కబ్జా చేస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. అరెస్టులు, జైళ్లు, అక్రమ కేసులు బీఆర్ఎస్ నాయకులకు కొత్త కాదని, ఉద్యమ కాలం నుంచే ఇవన్నీ ఎదుర్కొని ప్రజల పక్షాన నిలబడ్డామని కేటీఆర్ స్పష్టం చేశారు. ప్రభుత్వం తాటాకు చప్పుళ్లకు, బెదిరింపులకు ఎవరూ భయపడేది లేదని, ప్రజల పక్షాన పోరాటం ఆగదని హెచ్చరించారు. ప్రభుత్వం ఎంత అణచివేతకు పాల్పడినా, బాధితులకు అండగా ఉంటామని స్పష్టం చేశారు. అక్రమంగా నిర్బంధించిన నాయకులను వెంటనే విడుదల చేయాలని, భూ సేకరణను తక్షణమే నిలిపివేయాలని ఆయన డిమాండ్ చేశారు.

## కాంగ్రెస్ కోసం సైనికుల్లా పనిచేయాలి

మొదటిపేజీ తరువాయి
మంగళవారం నాగర్ కర్నూల్‌లో కొత్తగా ఏర్పాటైన జిల్లా కాంగ్రెస్ పార్టీ నేతల ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమంలో పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పీసీసీ చీఫ్ మాట్లాడుతూ.. ప్రధాని మోదీ పేదలకు చేసింది ఏమి లేదన్నారు. అలాంటి పార్టీ రాష్ట్రంలో ఎలా అధికారంలోకి వస్తుందని ప్రశ్నించారు.

కాంగ్రెస్ పార్టీ గుండెకాయ గ్రామాల్లో ఉందని మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. గ్రామాల్లోకి వెళ్లి కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయండంటూ కేడర్‌కు ఈ సందర్భంగా ఆయన సూచించారు. కులాలకు, మతాలకు, ప్రాంతాలకు అతీతంగా పని చేసే కాంగ్రెస్ పార్టీ కోసం కష్టపడి పని చేయాలని కేడర్‌కు స్పష్టం చేశారు. పార్టీలో అందరికీ అవకాశాలు వస్తాయని పేర్కొన్నారు. అలాగే పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టును పూర్తి చేసి.. లక్షల ఎకరాలకు సాగు నీరు ఇవ్వాలన్నారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పించాలని కేంద్రాన్ని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీ.. తన పాదయాత్రలో అన్ని విషయాలను తెలుసుకున్నారని వివరించారు. అందుకే స్థానిక ఎన్నికల్లో బీసీలకు 52 శాతం రిజర్వేషన్లు ఇచ్చామని పీసీసీ చీఫ్ తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రతి పేదవాడికి రేషన్ కార్డు మంజూరు చేశామని టీ పీసీసీ చీఫ్ చెప్పారు. ఇందిరమ్మ ఇళ్ళు, సన్న బియ్యం, ఉచిత ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించిన ఘనత కాంగ్రెస్ పార్టీకే చెందుతుందన్నారు. పార్టీ అగ్రనేత సోనియాగాంధీ ఇచ్చిన మాట ప్రకారం.. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఇచ్చారని గుర్తు చేశారు. నీళ్లు, నిధులు, నియామకాల కోసమే తెలంగాణ వచ్చిందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం పది సంవత్సరాలలో ఎన్ని నిధులు ఇచ్చారు? ఎన్ని నియామకాలు చేశారు? అంటూ ఆ పార్టీ నేతలకు టీ పీసీసీ చీఫ్ సూటిగా ప్రశ్నలు సంధించారు.

బీఆర్ఎస్ ప్రభుత్వం రూ. 8 లక్షల కోట్లు అప్పులు చేసి పోయిందని.. ఆ అప్పులను కాంగ్రెస్ ప్రభుత్వం తీర్చుస్తుందని ఆయన తెలిపారు. ఇచ్చిన హామీలను సైతం కాంగ్రెస్ పార్టీ నెరవేర్చుకుంటూ ముందుకు వెళ్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, జిల్లా పార్టీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే వంశీకృష్ణ, ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యేలు రాజేశ్ రెడ్డి, కసిరెడ్డి నారాయణరెడ్డి, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి సావర్కర్, కార్యదర్శి వంశీ చంద్ రెడ్డితోపాటు పలువురు నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మరింత పటిష్టంగా కాలేజీ విద్య

మొదటిపేజీ తరువాయి
ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇళ్ల నిర్మాణాన్ని ఎంత వేగంగా చేపడుతున్నారో.. ఇళ్ల స్థలాల పంపిణీని కూడా అదే స్థాయిలో చేపట్టేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని మార్గనిర్దేశర చేశారు. ఇక వర్షాకాలంలో ఇసుక సరఫరాలో ఇబ్బందులు రాకుండా ఇప్పటి నుంచే జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రజలకు ఇసుకను ఉచితంగా ఇస్తున్నామని.. ప్రభుత్వానికి వచ్చే ఆదాయాన్ని వదులుకుంటున్నామన్నారు. రీచుల వద్ద, స్టాక్ యార్డుల వద్ద రవాణా పేరుతో కానీ... ఇతర పేర్లతో ఎక్కువ ఛార్జీలు వసూలు చేయడానికి వీల్లేదని హుకుం జారీ చేశారు. ఈ విషయంపై పటిష్ఠ నిఘా పెట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. విశాఖపట్నంలోని ఆంధ్రా యూనివర్సిటీతోపాటు... మిగిలిన యూనివర్సిటీలు కూడా ర్యాకింగులను మరింతగా పెంచుకోవాల్సి ఉందని సూచించారు. ఇదే సందర్భంగా హయ్యర్ ఎడ్యుకేషనల్ కౌన్సిల్ కూడా మరింత యాక్టివ్‌గా ఉండాలని.. ఈ మేరకు విద్యాశాఖ అధికారులు కృషి చేయాలని నిర్దేశించారు. మధ్యాహ్న భోజన పథకం విషయంలో ఎలాంటి ఫిర్యాదులు కానీ... విమర్శలు కానీ రాకూడదన్నారు. శాప్ విభాగం తన యాక్టివిటీని మరింత పెంచుకోవాలని సూచించారు. 5కే రన్ వంటి కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ప్రజల్లో, యువతలో ఆరోగ్య రక్షణ పట్ల అవగాహన కల్పించేలా శాప్ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రోడ్డు ప్రమాదాలు తగ్గించేలా చర్యలు తీసుకోవాలని.. ప్రజలకు వీటిపై అవగాహన కల్పించాలని సూచించారు. ట్రిపుల్ రైడింగ్ వల్ల ఎక్కువ ప్రమాదాలు, మరణాలు జరుగుతున్నాయని.. ఇలాంటి వాటిని నివారించాలని ఆదేశించారు. కఠినంగా నిబంధనలు అమలు చేయడానికంటే ముందు... ప్రజలను ఎడ్యుకేట్ చేయాలని సూచించారు. హెల్మెట్ వల్ల ప్రమాదాల నివారణపై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. ట్రాఫిక్ నిబంధనలు తమ కోసమేననేది ప్రజలు అర్థం చేసుకునేలా అవగాహన కల్పించాలని సూచించారు. విద్యుత్, కేబుల్ తీగలు కిందకు వేలాడుతున్న కారణంగా అగ్ని ప్రమాదాలు జరిగి ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని.. ఇలాంటివి ఇకపై జరగడానికి వీల్లేదని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. పిడుగు పాటుకు ప్రజల ప్రాణాలు పోకూడదనే ముందస్తుగా అలెర్ట్ మెసేజ్‌లు పంపిస్తున్నామని...అయినా అక్కడక్కడా మరణాలు సంభవిస్తున్నాయని సీఎం చంద్రబాబు తెలిపారు. టెక్నాలజీని వినియోగిస్తున్నామని... కానీ ప్రజల్లో దానిపై అవగాహన కలిగించేలా చేయకుంటే ఏం ఉపయోగం...? ఉంటుందని అన్నారు. ఫోన్లల్లో మెసేజీలు పెట్టడమే కాదని... క్షేత్రస్థాయిలో ఉన్న సిబ్బందిని అలర్ట్ చేయాలని సూచించారు. అలాగే ఫలానా టవర్ లోకేషన్ పరిధిలో పిడుగులు పడే ప్రమాదం ఉందని నెట్‌వర్క్ ద్వారా ప్రజలకు తెలియచేసేలా చూడాలని సీఎం ఆదేశించారు. ఈ సమీక్ష అనంతరం ఆర్టీజీఎస్ రూపొందించిన అవేర్2.0 మొబైల్ యాప్‌ను ముఖ్యమంత్రి ప్రారంభించారు. ఈ సమీక్షా సమావేశంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. అగ్నిమాపక శాఖ నూతన వాహనాలు, పరికరాలను అమరావతి పరేడ్ గ్రౌండ్ నుంచి జెండా ఊపి సీఎం చంద్రబాబు ప్రారంభించారు. రూ.252.93 కోట్లతో అగ్నిమాపక శాఖ ఆధునీకీకరణ చేశారని.. ఇందులో భాగంగా రూ.33.25 కోట్ల విలువైన వాహనాలు, వివిధ పరికరాలు అందుబాటులోకి ప్రభుత్వం తీసుకువచ్చిందని తెలిపారు. రూ.18 కోట్ల వ్యయంతో తొలిదశలో 25 అధునాతన అగ్నిమాపక శకటాలను ప్రభుత్వం కొనుగోలు చేసిందన్నారు. రూ.10 కోట్ల వ్యయంతో హై ప్రెషర్ పంప్‌లు కలిగిన 40 క్విక్ రెస్పాన్స్ వాహనాలను, రూ.2.49 కోట్లతో 50 ఇన్ ప్లేటబుల్ రబ్బర్ బోట్లు, రూ.2.08 కోట్లతో 30 బీఏ సెట్ కంప్రెసర్లను ప్రభుత్వం కొనుగోలు చేసిందని చెప్పారు. పరికరాలు, వాహనాల గురించి ముఖ్యమంత్రికి అధికారులు వివరించారు. కేంద్ర నిధులను సమర్థంగా వినియోగించుకున్న అధికారులను సీఎం అభినందించారు. ప్రజల ప్రాణాలు కాపాడటానికి ప్రథమ ప్రాధాన్యం ఇవ్వాలని సీఎం చంద్రబాబు సూచించారు. రాజధానితో పాటు ఇప్పుడు ప్రధాన నగరాల్లో హై రైజ్డ్ బిల్డింగ్‌లు నిర్మాణం అవుతున్నాయని.. వాటికి అనుగుణంగా అగ్నిమాపక శాఖ అన్ని విధాలా ఆధునిక పరికరాలు సమకూర్చుకోవాలని మార్గనిర్దేశర చేశారు. గతంలో అగ్నిమాపక విభాగంలో ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా ఉండేవాళ్లమని...ఇప్పుడు మళ్లీ ఆ స్థాయికి రావాలని ఆకాంక్షించారు. విపత్తుల సమయంలో పొరుగు రాష్ట్రాలకు సహాయం చేసిన చరిత్ర ఉందని ప్రస్తావించారు. అన్ని సవాళ్లను అధిగమించి కేంద్ర పథకాలను, రాష్ట్ర ప్రభుత్వ నిధులను సద్వినియోగం చేసుకుని బలోపేతం అవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హోంమంత్రి వంగలపూడి అనిత, స్థానిక ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్, అగ్నిమాపక శాఖ డీజీ పీవీ రమణ, హోంశాఖ ముఖ్యకార్యదర్శి కుమార్ విశ్వజిత్, పలువురు పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

## బెంగాల్‌పై కన్నేస్తే.. పాక్ ముక్కలే

మొదటిపేజీ తరువాయి
భవిష్యత్తులో భారత్ ఏమైనా దాడులకు పాల్పడితే.. కోల్‌కతానూ లక్ష్యంగా చేసుకుంటామని పాక్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ ఇటీవల కవ్వింపులకు పాల్పడ్డారు. కోల్‌కతాపై దాడి చేస్తామన్న పాకిస్థాన్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ వ్యాఖ్యలపై కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఘాటుగా స్పందించారు. ఇలాంటి రెచ్చగొట్టే ప్రకటనలను ఆయన చేయకుండా ఉండాల్సిందని, బెంగాల్‌పై కన్నేస్తే పాకిస్థాన్ ఎన్ని ముక్కలుగా విడిపోతుందో భగవంతుడికే తెలియాలని అన్నారు. ఈ వ్యాఖ్యల పైనే తాజాగా రాజ్‌నాథ్ ఘాటుగా స్పందించారు. ఓ వార్తా సంస్థతో ఆయన మాట్లాడుతూ.. ఇలాంటి రెచ్చగొట్టే వ్యాఖ్యల వల్లనే 55 ఏళ్ల క్రితం పాక్ రెండుగా విడిపోయిన విషయాన్ని గుర్తుచేశారు. 1971లో జరిగిన యుద్ధంలో పాకిస్థాన్ నుంచి విడిపోయి బంగ్లాదేశ్ స్వతంత్ర దేశంగా ఏర్పడింది. నాడు బంగ్లా విముక్తి పోరాటానికి భారత సైన్యం అండగా నిలిచింది. ఉద్రిక్తతలను పెంచే ప్రకటనలు చేయవద్దని ఇస్లామాబాద్‌ను ఆయన హెచ్చరించారు. వారు బెంగాల్‌పై కన్నేస్తే.. ఈసారి పాక్ ఎన్ని ముక్కలవుతుందో ఆ దేవుడికే తెలియాలి అని వ్యాఖ్యానించారు. భారత్ భవిష్యత్తులో ఎలాంటి దుస్సాహసాలకు పాల్పడినా కోల్‌కతాపై దాడి చేస్తామని ఖవాజా ఆసిఫ్ గత శనివారంనాడు నోరుపారేసుకున్నారు. దీనిపై తృణమూల్ కాంగ్రెస్ పార్టీ అధినేత్ర మమతా బెనర్జీ, ఎంపీ అబిషేక్ బెనర్జీ కేంద్ర ప్రభుత్వంపై విమర్శలకు దిగింది. కోల్‌కతాపై దాడి చేస్తామని బహిరంగంగా బెదిరించినా ఖవాజా ఆసిఫ్ ప్రకటలను ఖండించే ధైర్యం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, హోం మంత్రి అమిత్‌షాకు లేకుండా పోయిందని అభిషేక్ బెనర్జీ విమర్శించారు. ఒక ఔన్సు ధైర్యం ఉన్నా కేంద్ర బలగాలకు, బీఎస్ఎఫ్, ఇండియన్ ఆర్మీకు పాక్ ఆక్రమిత కశ్మీర్‌ను తిరిగి పట్టుకునేందుకు స్వేచ్ఛనివ్వాలని అన్నారు. మోదీ, అమిత్, రాజ్‌నాథ్ సింగ్‌కు ఆ సాహసం ఉందా? అని ప్రశ్నించారు. మమతా బెనర్జీ సైతం కోల్‌కతాపై దాడి చేస్తామన్న పాక్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ వ్యాఖ్యలపై ప్రధాని మోదీ ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నించారు. భారత్ స్పందన తీవ్రంగా ఉంటుందని ఆయన ఎందుకు హెచ్చరించలేకపోతున్నారు? అని నిలదీశారు. ప్రధాని రాజీనామాకు డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో రాజ్‌నాథ్ సింగ్ తాజాగా స్పందించడం ప్రాధాన్యం సంతరించుకుంది.

## రేవంత్‌తో చర్చకు దిగే ఉద్దేశం లేదు

మొదటిపేజీ తరువాయి
నీతి ఆయోగ్ 2023-24 సుస్థిరాభివృద్ధి లక్ష్యాల (ఎస్డీజీ) సూచీలో కేరళ తొలి స్థానంలో ఉందని పినరయి విజయన్ అంటున్నారని, ఇది కేరళలో ఏడు దశాబ్దాల ప్రభుత్వాలన్నింటి కృషి అని సోమవారం సీఎం రేవంత్ పేర్కొన్న సంగతి తెలిసిందే. అందులో కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ కూడా ఉందని గుర్తించాలన్నారు. అందరి కష్టాన్నీ సొంత ఖాతాలో వేసుకోవడం సరికాదని హితవు పలికారు. ఈ అంశంపై చర్చించేందుకు సిద్ధంగా ఉన్నానని, చర్చకు రావాలని పినరయి విజయన్‌కు సవాల్ విసిరారు.

### మీ హయాంలో ఏం చేశారో చూపించండి: రేవంత్‌రెడ్డి

తెలంగాణ ప్రభుత్వ పనితీరును విమర్శిస్తూ కేరళ సీఎం పినరయి విజయన్ రాసిన లేఖపై సీఎం రేవంత్‌రెడ్డి మరోసారి స్పందించారు. కేరళ ప్రభుత్వ పనితీరుపై తన విమర్శలను ఎంతో గౌరవప్రదంగా, హుందాగా వ్యక్తం చేశానని అన్నారు. విజయన్ మాత్రం తక్కువ స్థాయి భాషను ఉపయోగించాలని నిర్ణయించుకున్నట్లు చెప్పారు. " మీ అసహనపూరిత వ్యాఖ్యలకు నేను అదే రీతిలో స్పందించను. మీరు నా రాష్ట్రానికి వచ్చినప్పుడు, ఒక అతిథికి చేయాల్సిన అన్ని మర్యాదలు చేస్తానని మాట ఇస్తున్నా. ప్రస్తుత తెలంగాణ పరిస్థితికి మీరు నీతి ఆయోగ్ ఎస్డీజీ ఇండెక్స్ 2023-24ని ప్రామాణికంగా చూపిస్తున్నారు. ఆ సూచీ డిసెంబర్ 2023తో ముగిసిన బీఆర్ఎస్ పదేళ్ల దుష్పరిపాలనను ప్రతిబింబిస్తుంది. మా ప్రభుత్వం 28 నెలలు పూర్తి చేసుకుంది. 2024-25లో తెలంగాణ జీఎస్డీపీ రూ.16.12 లక్షల కోట్లుగా ఉండి.. 10.7 శాతం వృద్ధిని నమోదు చేసింది. ఇది జాతీయ సగటు 9.9 శాతం కంటే ఎక్కువ. కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర, కేరళలను అధిగమించి భారత్‌లోనే అత్యధిక తలసరి ఆదాయం ఉన్న రాష్ట్రంగా తెలంగాణ నిలిచింది. కేరళ ప్రజలకు మీ హయాంలో ఏం జరిగిందో చూపించండి" అని ఎక్స్‌లో పేర్కొన్నారు.

## ఐటీ కారిడార్ లో హైడ్రా భారీ ఆపరేషన్
## 12 వందల కోట్ల విలువైన 8 ఎకరాలు స్వాధీనం

మొదటిపేజీ తరువాయి
ఐటీ కారిడార్ కు చేరువలోని ఖానామెట్ లో 8 ఎకరాలకు పైగా ప్రభుత్వ భూమిలో ఆక్రమణలు తొలగించింది హైడ్రా. స్థానికుల ఫిర్యాదు మేరకు రంగంలోకి దిగిన హైడ్రా అధికారులు ఆక్రమణల కూల్చివేత చేపట్టారు. హైడ్రా కాపాడిన ప్రభుత్వ భూమి విలువ సుమారు రూ. 12 వందల కోట్లు ఉంటుందని అంచనా వేస్తున్నారు అధికారులు. ఖానామెట్ లోని సర్వే నంబర్ 55లో ఉన్న ప్రభుత్వ భూమిలో భారీ ఆపరేషన్ చేపట్టారు హైడ్రా అధికారులు. ఈ స్థలంలో తాత్కాలిక షెడ్లు, నిర్మాణాలు తొలగించారు హైడ్రా అధికారులు. హైడ్రా వార్నింగ్ తో ఆర్‌సీసీ ప్లాంట్‌ను స్వయంగా తొలగించింది ప్రభుత్వ భూమిని ఆక్రమించిన నిర్మాణ సంస్థ. ప్రభుత్వ భూమిలో కార్మికుల కోసం ఏర్పాటు చేసిన షెడ్లను తొలగించిన హైడ్రా.. మొత్తం భూమి చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేసింది. ప్రభుత్వ భూమిగా బోర్డులు ఏర్పాటు చేసి..అసైన్డ్ ల్యాండ్‌గా గుర్తించి, ప్రొహిబిటెడ్ లిస్ట్‌లో నమోదు చేసినట్లు తెలిపారు అధికారులు. రియల్ ఎస్టేట్ సంస్థల తప్పుడు ÷-లకెయిమ్‌లపై చర్యలు తీసుకుంటామని తెలిపారు అధికారులు.

## యూరియా యాప్ పై హర్షం
# వ్యక్తం చేసిన రైతులు

మొదటిపేజీ తరువాయి
రైతుల అభిప్రాయాలను పరిగణలోనికి తీసుకొని, రైతుల అభిప్రాయాల మేరకే ఈ ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుంటుందని మంత్రిగారు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా అధిక యూరియా వాడకం ద్వారా వచ్చే అనర్థాలను రైతులకు మంత్రి వివరించారు. రైతులు తాము పండించే అన్ని పంటలలో పామాయిల్ పంటను కూడా వేయవచ్చని, పామాయిల్ పంటను వేసి కూడా వరి, పత్తి, మొక్కజొన్న లాంటి పంటలు పండించుకోవచ్చని రైతులకు వివరించారు. రైతులందరు పామాయిల్ పంటను వేసినట్లయితే స్థిరమైన అధిక ఆదాయం పొందే వీలుంటుందని అన్నారు. సచివాలయంలో హుజురాబాద్ మున్సిపల్ చైర్మన్ మరియు కౌన్సిలర్లు, సర్పంచ్ లు వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుగారిని మర్యాదపూర్వకంగా కలిసి శాలువతో సన్మానించారు. ఈ సందర్భంగా హుజురాబాద్ ప్రతిపాదించిన డంపింగ్ యార్డు పనులను నిలిపివేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో హుజురాబాద్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఒడితల ప్రణవ్ పాల్గొన్నారు.

## తెలంగాణలో మావోయిస్టుల శకం ముగిసింది

మొదటిపేజీ తరువాయి
తెలంగాణలో మావోయిజం పూర్తిగా అంతరించిందని రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి అధికారికంగా ప్రకటించారు. 'ఫేస్ టు ఫేస్' కార్యక్రమంలో పాల్గొన్న ఆయన, కర్రెగుట్టల వంటి మారుమూల ప్రాంతాల్లో మారుతున్న పరిస్థితులను వివరించారు. ఒకప్పుడు దట్టమైన అడవుల్లో సమాంతర ప్రభుత్వాన్ని నడిపిన మావోయిస్టుల ఉనికి ఇప్పుడు తెలంగాణలో లేదని డీజీపీ స్పష్టం చేశారు. ఆపరేషన్ కగార్ విజయవంతం కావడంతో పాటు, కీలక నాయకత్వం , సైన్యాధ్యక్షులు సైతం బయటకు రావడంతో ఆ వ్యవస్థ పూర్తిగా కొలాప్స్ అయిందని ఆయన పేర్కొన్నారు. ఇప్పుడు ఈ ప్రాంతాలు నక్సల్ రహిత జోన్లుగా మారాయని, ప్రజలు స్వేచ్ఛగా తిరుగుతున్నారని తెలిపారు. గతంలో కనీస సౌకర్యాలు లేకపోవడమే నక్సలిజం పెరగడానికి ప్రధాన కారణమని గుర్తించిన ప్రభుత్వం, ఇప్పుడు ఆ లోటును భర్తీ చేస్తోంది. బాహ్య ప్రపంచంతో సంబంధం లేని కర్రెగుట్టల వంటి ప్రాంతాలకు ఇప్పుడు బిటి రోడ్ల నిర్మాణం జరుగుతోంది. దీనివల్ల ఆదివాసీలకు రవాణా సౌకర్యం మెరుగుపడింది. అత్యవసర సమయాల్లో ఆసుపత్రికి వెళ్లడానికి గ్రామస్తుల కోసం ప్రభుత్వం ఒక ఆటో , టూ వీలర్‌ను కమ్యూనిటీ వాహనాలుగా అందజేసింది. గతంలో 12-13 కిలోమీటర్లు కాలినడకన వెళ్లాల్సిన దుస్థితి ఇప్పుడు తొలగిపోయింది. ఇప్పటికీ విద్యుత్ సౌకర్యం లేని మారుమూల ఇళ్లకు సోలార్ కందిళ్లను పంపిణీ చేయడం ద్వారా ప్రభుత్వం చీకట్లను తొలగిస్తోంది. కనీసం ఆధార్ కార్డులు, ఓటు హక్కు వంటి కనీస గుర్తింపు కూడా లేని ఆదివాసీలకు ఇప్పుడు అన్ని ప్రభుత్వ ఫలాలను అందించడమే లక్ష్యంగా పోలీస్ బాస్ స్వయంగా క్షేత్రస్థాయిలో పర్యటించారు. ఈ ప్రాంతాలను పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్దే అవకాశం ఉందని, అటవీ వనరులను కాపాడుకుంటూనే అభివృద్ధిని ముందుకు తీసుకెళ్తామని డీజీపీ భరోసా ఇచ్చారు. తుపాకీ గొట్టం ద్వారా కాకుండా, అభివృద్ధి ద్వారానే మార్పు సాధ్యమని తెలంగాణ ప్రభుత్వం నిరూపిస్తోంది. కర్రెగుట్టల వంటి ప్రాంతాల్లో వేసిన రోడ్లు కేవలం రవాణా కోసమే కాదు, ఆ ప్రజల ఉజ్వల భవిష్యత్తు కోసం వేసిన బాటలు అని చెప్పవచ్చున్నారు.

## అడ్డదారుల్లో ధాన్యాన్ని తరలిస్తే ఉపేక్షించం
## మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి హెచ్చరిక

అడ్డదారుల్లో ధాన్యాన్ని తరలిస్తే ఉపేక్షించేది లేదని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి హెచ్చరించారు. రాష్ట్ర సరిహద్దుల్లో ధాన్యం ఎగుమతులు, దిగుమతులపై కట్టుదిట్టమైన నిఘా ఉంచామని స్పష్టం చేశారు. ఈ రబీ సీజన్‌లో 148 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి ఉందని తెలిపారు. 90 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు తమ ప్రభుత్వం సన్నద్ధమైందని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 8,251 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామని చెప్పారు. అందుబాటులో 16 కోట్ల గన్నీ బ్యాగులు ఉన్నాయని తెలిపారు. అంతకుముందు హుజూర్ నగర్ రామస్వామి గట్టు సమీపంలో ఐటీ కాలేజీతో పాటు మోడల్ కాలనీ పనులను మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పరిశీలించారు. హుజూర్ నగర్ నియోజకవర్గ కేంద్రంలో 116 ఎకరాల్లో నిర్మిస్తున్న 2,160 సింగిల్ బెడ్‌రూమ్ ఇళ్ల మోడల్ కాలనీ రాష్ట్రానికే ఆదర్శంగా నిలుస్తాయని చెప్పుకొచ్చారు. కాలనీ నిర్మాణానికి రూ.125 కోట్లు ఖర్చు, అదనంగా రూ.20 కోట్లు మంజూరయ్యాయని వెల్లడించారు. లబ్దిదారుల ఎంపిక పూర్తిగా పారదర్శకంగా జరుగుతుందని, ఎలాంటి పైరవీలకు అవకాశం ఉండదని స్పష్టం చేశారు. జాబితాలో ఎవరైనా అనర్హులు ఉంటే నేరుగా ఫిర్యాదు చేయాలని సూచించారు. మొదటి విడతలో 1500 మంది లబ్దిదారులను ఎంపిక చేసినట్లు తెలిపారు. ఏప్రిల్ నెలాఖరులో మోడల్ కాలనీ ప్రారంభోత్సవం జరుగుతోందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు.

# జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వెల్దుర్తి ఉపాధ్యాయులచే కొనసాగిన ప్రత్యేక నమోదు కార్యక్రమం లో పాల్గొన్న

- గ్రామ సర్పంచ్ నరసింహ రెడ్డి
- వెల్దుర్తి పాఠశాల ప్రధానోపాధ్యాయులు సాంబయ్య
- ఉప సర్పంచ్ రమేష్

**కరపత్రం ప్రతినిధి వెల్దుర్తి మాసాయిపేట ఏప్రిల్ 7**
వెల్దుర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆధ్వర్యంలో విద్యార్థుల ప్రత్యేక నమోదు కార్యక్రమం విజయవంతంగా నిర్వహించిన గ్రామ సర్పంచ్ నరసింహ రెడ్డి వెల్దుర్తి పాఠశాల ప్రధానోపాధ్యాయులు సాంబయ్య ఓ సర్పంచ్ రమేష్ సందర్భంగా వారు మాట్లాడుతూ
హస్తల్ పూర్ గ్రామం నుంచి పరిసర ప్రాంతాల్లో గల పలు ప్రైవేట్ పాఠశాలలకు వెళ్లి చదువుతున్న 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులను గుర్తించి, వారి ఇళ్ల వద్దకు ప్రత్యక్షంగా వెళ్లి తల్లిదండ్రులతో ఉపాధ్యాయ బృందం అవగాహన కార్యక్రమం నిర్వహించమనీ
ఈ కార్యక్రమాన్ని పాఠశాల ఉపాధ్యాయులు వెంకటస్వామి ఆధ్వర్యంలో ఉపాధ్యాయ బృందం, గ్రామ ప్రజాప్రతినిధులు కలిసి నిర్వహించారు. తల్లిదండ్రులతో ప్రత్యేకంగా కౌన్సిలింగ్ నిర్వహించి తమ పిల్లలను వెల్దుర్తి ఉన్నత పాఠశాలలో చేర్పించలని వారి ఉజ్వల భవిష్యత్తుకు తోడ్పడాలని సూచించారు.
ఈ సందర్భంగా హస్తల్ పూర్ గ్రామ సర్పంచ్ నరసింహారెడ్డి మాట్లాడుతూ పాఠశాలలో ప్రైవేట్ పాఠశాలల కంటే మెరుగైన సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. వచ్చే విద్యా సంవత్సరం నుండి



విద్యార్థులకు ఉదయం పూట బ్రేక్‌ఫాస్ట్ సౌకర్యం కూడా కల్పించనున్నట్లు తెలిపారు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన సౌకర్యాల కోసం తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని కోరారు అనంతరం గ్రామ ఉప సర్పంచ్ రమేష్ మాట్లాడుతూ పాఠశాలలో డిజిటల్ విద్యా బోధన కొనసాగుతోందని, 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు ఆంగ్ల మాధ్యమ బోధన అందుబాటులో ఉందని తెలిపారు. అదేవిధంగా విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని రెండు రకాల వృత్తి విద్య (వొకేషనల్ కోర్సులు) కూడా అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ అవకాశాలను తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.
ఈ సందర్భంగా పలువురి తల్లిదండ్రులు మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలలపై ఉన్న వ్యామోహం వల్ల ఆర్థిక సహాయం ఇబ్బందులు ఉన్నప్పటికీ చాలా మంది తమ పిల్లలను ప్రైవేట్ పాఠశాలలకు పంపుతున్నారని తెలిపారు. , అన్ని వసతులు, కార్పొరేట్ స్థాయి సదుపాయాలతో నాణ్యమైన విద్యను అందిస్తున్న జిల్లా పరిషత్ ఉన్నత వెల్దుర్తి పాఠశాలలోనే తమ పిల్లలను చేర్పించాలని గ్రామ ప్రజలు నిర్ణయించుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం గ్రామంలో ప్రభుత్వ పాఠశాలల పట్ల విశ్వాసాన్ని మరింత పెంచుతూ విజయవంతంగా కొనసాగుతోంది.
ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి. సాంబయ్య మాట్లాడుతూ, గ్రామస్తులు, యువకులు, కలిసి సమాజ భాగస్వామ్యంతో పాఠశాల అభివృద్ధి కోసం కృషి చేయగలరని తెలిపారు. విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించడంతో పాటు నాణ్యమైన విద్య అందించేందుకు పాఠశాల నిరంతరం ప్రయత్నిస్తున్నదని పేర్కొన్నారు. ఈ ప్రయత్నాలను విశ్వసించిన తల్లిదండ్రులు ఆనందంగా తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలకు పంపేందుకు ముందుకు వస్తున్నారని చెప్పారు. ఈ ప్రత్యేక నమోదు కార్యక్రమంలోఉపాధ్యాయులు నరసింహారెడ్డి నవనీత సునీత మహేష్లుపాల్గొన్నారు

# పారిశుద్ధ కార్మికులతో సమావేశమైన మున్సిపల్ చైర్మన్

**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట ఏప్రిల్ 7**
జమ్మికుంట పట్టణంలో పారిశుద్ధ సేవలను మరింత మెరుగుపర్చేందుకు మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ (దిలీప్) ఉదయం పూట పారిశుద్ధ కార్మికులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పట్టణ ప్రజలు నిద్రలేచేలోపు ఇంటి ముందు రహదారులు, డ్రైన్లు శుభ్రపరచడం, చెత్త సేకరణ వాహనాలతో సమయానికి సేవలు అందించడం ఎంతో ముఖ్యమని తెలిపారు. ప్రజలతో మమేకమై, బాధ్యతాయుతంగా పనిచేస్తేనే పట్టణం పరిశుభ్రంగా ఉండగలదని అన్నారు. ప్రతి కార్మికుడు తనకు కేటాయించిన వార్డులో సమయపాలన పాటిస్తూ పనులను త్వరగా పూర్తి చేయాలని, స్థానిక కౌన్సిలర్లకు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండాలని సూచించారు. ప్రస్తుతం ఎండాకాలం దృష్ట్యా ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కార్మికులకు సూచించారు. "మీ ఆరోగ్యం మీదే బాధ్యత" అని స్పష్టం చేస్తూ, పనితో పాటు ఆరోగ్యాన్ని కూడా కాపాడుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్స్పెక్టర్లు మహేష్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.





# డంపింగ్ యార్డ్‌ను సందర్శించిన మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ (దిలీప్)

**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట, ఏప్రిల్ 7:**
జమ్మికుంట పట్టణంలో పారిశుద్ధ నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించిన మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ (దిలీప్) మంగళవారం డంపింగ్ యార్డ్‌ను ప్రత్యక్షంగా సందర్శించి అక్కడి పరిస్థితులను సమగ్రంగా పరిశీలించారు. పట్టణంలోని 30 వార్డుల నుండి సేకరించే చెత్త చెదారం, రోడ్లు, డ్రైన్లు, గృహాల నుండి వచ్చే వ్యర్థాలను ఎలా సేకరిస్తున్నారు, ఎలా తరలిస్తున్నారు, చివరకు డంపింగ్ యార్డ్‌లో ఎలా నిర్వహిస్తున్నారు అన్న అంశాలను స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ, పట్టణ పరిశుభ్రతకు డంపింగ్ యార్డ్ కీలకమని, అయితే అక్కడ సరైన విధానంలో వ్యర్థాల నిర్వహణ జరగాల్సిన అవసరం ఉందన్నారు. చెత్తను ఎక్కడ పడితే అక్కడ పారేయకుండా శాస్త్రీయ పద్ధతిలో వర్గీకరించి, పర్యావరణానికి హాని కలగకుండా



నిర్వహించాలని అధికారులకు సూచించారు. డంపింగ్ యార్డ్ పరిసరాల్లో దుర్వాసన, దోమల పెరుగుదల, కాలుష్య సమస్యలు లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, అవసరమైన యంత్రాలు, వనరులు సమకూర్చి పారిశుద్ధ పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. అలాగే చెత్త సేకరణ వాహనాలు సమయానికి వార్డులకు వెళ్లేలా పర్యవేక్షణ పెంచాలని



సూచించారు. పట్టణ ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని, చెత్త నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని స్పష్టం చేసిన చైర్మన్, పారిశుద్ధ కార్మికులు తమ విధులను క్రమశిక్షణతో నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్స్పెక్టర్లు మహేష్, శ్రీకాంత్ మరియు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# బాధితులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేసిన మెదక్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్పర్సన్ చిలుముల సుహాసిని రెడ్డి,

- మెదక్ జిల్లా అధికార ప్రతినిధి బండారి గంగాధర్

**కరపత్రం ప్రతినిధి వెల్దుర్తి మాసాయిపేట ఏప్రిల్ 7**



మెదక్ జిల్లానర్సాపూర్ నియోజకవర్గం శివంపేట్ మండల్ గూడూరు గ్రామంలో బోయిని కొమరమ్మ 46500 రూపాయలునర్సాపూర్ నియోజకవర్గం ఆవంచ గ్రామం మహమ్మద్ బద్దర్ 14.000 రూపాయల ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి విడుదలైన సీఎం ఆర్ ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు
ఈ సందర్భంగాచిలుముల సుహాసిని రెడ్డి,బండారి గంగాధర్ మాట్లాడుతూ అనారోగ్యం, ప్రమాదాలు తదితర కారణాలతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద కుటుంబాలకు సీఎంఆర్ ఎఫ్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ప్రభుత్వం వైద్య చికిత్సల కోసం పెద్ద మొత్తంలో ఖర్చు చేయలేని నిరుపేదలకు ప్రభుత్వం అండగా నిలబడడం ప్రభుత్వం అండగా ఉందన్నారు.., ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్పర్సన్ చిలుముల సుహాసిని రెడ్డి కాంగ్రెస్ నాయకులు రాధాకృష్ణ .శ్రీశైలం యాదవ్ దడిగ నరేష్ , కొండి దుర్గేష్, శ్రీనివాస్ రెడ్డి. శంకర్ గౌడ్,చందు,చిన్న యాదవ్, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు

# డంపింగ్ యార్డు నిర్మాణాన్ని తక్షణమే రద్దు చేయకపోతే తెలంగాణ ఉద్యమ తరహాలో ఉద్యమం

– రైతు ప్రజాసంఘాల సమాఖ్య జాతీయ అధ్యక్షుడు పోలాడి రామారావు

**కరపత్రం ప్రతినిధి హుజురాబాద్:**
హుజురాబాద్ ప్రాంతానికి 2 కిలో మీటర్ల దూరంలోని సిర్సపల్లి గ్రామ సరిహద్దులో పచ్చని పొలాల హైవే ప్రక్కన నిర్మించ తల పెట్టిన వేస్టు టు ఎనర్జీ డంపింగ్ యార్డ్ ప్రాజెక్టును రద్దు చేస్తూ అధికారిక ప్రకటన చేయాలని రైతు ప్రజాసంఘాల సమాఖ్య జాతీయ అధ్యక్షుడు పోలాడి రామారావు డిమాండ్ చేశారు. డంపింగ్ యార్డ్ ప్రాజెక్టును రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ స్థానిక శాసన సభ్యుడు పాడి కౌశిక్ రెడ్డి వేలాది మంది తో మంగళవారం చేపట్టిన 24 గంటల నిరాహార దీక్ష శిబిరాన్ని రైతు ప్రజాసంఘాల జేఏసీ నాయకులు తో కలిసి పోలాడి రామారావు సందర్శించి పాడి కౌశిక్ రెడ్డికి సంఘీభావం తెలిపి మాట్లాడారు. ఉమ్మడి కరీంనగర్ వరంగల్ జిల్లా ల చెత్తను తరలించడానికి మధ్యలో ఉన్న హుజురాబాద్ ప్రాంతంలో ఎలాంటి నిబంధనలు పాటించకుండా రాంకీ అనే ప్రైవేట్ సంస్థకు డిజైన్ బిల్డ్ ఫైనాన్స్



ఆపరేట్ ట్రాన్సఫర్ డిబిఎఫ్ఓటి పద్ధతిలో డంప్ యార్డ్ ప్రాజెక్టు నిర్మాణాన్ని అప్పజెప్పి ప్రజాభిప్రాయ సేకరణ చేయకుండా
25 ఏళ్ల క్రితం జవహర్ నగర్లో నిర్మించిన రాంకీ సంస్థకు అప్పజెప్పడం అధికార ప్రజా ప్రతినిధుల ప్రమేయం తోనే జరిగిందని ధ్వజమెత్తారు.
ఇప్పటికే జవహర్ నగర్లో ఈ రాంకీ సంస్థ నిర్మించిన డంప్ యార్డ్ వాళ్ళ అక్కడి వేలాది మందికి అనారోగ్య కారణాల వల్ల మంచం పట్టి రోగాల వినికిడి సమస్యలతో తో అవస్థల పాలై జీవచ్ఛవాళ్ళ పడి ఉన్నారని ఆవేదన వ్యక్తం చెందారు. ఇట్టి డంప్ యార్డ్ ప్రాజెక్టును తక్షణమే రద్దు చేయాలని ప్రజలు రోడ్ల పైకి వచ్చి ఆందోళనలు చేస్తుంటే ప్రభుత్వంలో కనీస చలనం లేదని చెప్పారు. స్థానిక ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి దీక్షతో నేడు వేలాది మంది ప్రజల నినాదాలతో తెలంగాణ ఉద్యమ తరహాలో నిరసనలతో హోరెత్తించారని వేలాది మంది మహిళలు పాల్గొన్నారని ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి డంపింగ్ యార్డు నిర్మాణాన్ని తక్షణమే నిలిపి వేస్తూ అధికారికంగా ప్రకటించాలని పోలాడి రామారావు డిమాండ్ చేశారు కాలయాపన చేస్తే మూల్యం చెల్లించక తప్పదని ప్రభుత్వాన్ని స్తంభింప జేస్తామని హెచ్చరించారు ప్రైవేట్ సంస్థ తో కాకుండా ప్రభుత్వమే జపాన్ లో నిర్మించినట్లుగా ఎలాంటి కాలుష్యం లేకుండా ఉండే విధంగా జనావాసాలకు దూరంగా నిర్మించాలని రామారావు డిమాండ్ చేశారు. కమిషన్ ల కోసం ప్రజల ప్రాణాలను ఫణంగా పెట్టవద్దని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎడవెల్లి కొండాల్ రెడ్డి మాట్లాడుతూ ఎట్టి పరిస్థితుల్లోనూ డంపింగ్ యార్డ్ ప్రాజెక్టును అడ్డుకొని తీరుతామని ప్రాణాలను సైతం లెక్క చేయకుండా తెలంగాణ ఉద్యమ తరహాలో ఉద్యమించి ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

# బీఎస్పీ ఆధ్వర్యంలో అంబేద్కర్ 135వ జయంతి భారీ బహిరంగ సభ -- విజయవంతం చేయాలని పిలుపు



**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట ఏప్రిల్ 7**
హుజురాబాద్: భారతరత్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ 135వ జయంతిని పురస్కరించుకుని బహుజన్ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో ఈ నెల 14న కరీంనగర్‌లోని మహాత్మ జ్యోతిరావు పూలే (సర్కస్ గ్రౌండ్) మైదానంలో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు జోన్ ఇంచార్జ్ పల్లె ప్రశాంత్ గౌడ్ తెలిపారు. ఈ సభను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.
బీఎస్పీ జాతీయ అధ్యక్షురాలు, ఉత్తర ప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి బెహెన్జీ కుమారి మాయావతి ఆదేశాల మేరకు తెలంగాణ రాష్ట్రాన్ని నాలుగు జోన్లుగా విభజించగా, అదిలాబాద్ జోన్ (వన్) పరిధిలో అదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, జహీరాబాద్ పార్లమెంటరీ నియోజకవర్గాల స్థాయిలో ఈ జయంతి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.
హుజురాబాద్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద అంబేద్కర్ జయంతి వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పల్లె ప్రశాంత్ గౌడ్ మాట్లాడుతూ---
నియోజకవర్గంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలు, అగ్రవర్ణ పేదలు, బీఎస్పీ నాయకులు, అంబేద్కర్ అభిమానులు, సంఘాల ప్రతినిధులు కుటుంబ సమేతంగా పెద్ద ఎత్తున హాజరై సభను విజయవంతం చేయాలని కోరారు.
ఈ కార్యక్రమంలో బీఎస్పీ జిల్లా ఉపాధ్యక్షులు గిన్నారపు మహేందర్, ఎమ్మెల్యే/ఎంపీ అభ్యర్థి మారపల్లి మొగిలయ్య, హుజురాబాద్ నియోజకవర్గ ఇన్చార్జి డాక్టర్ అంబాల ప్రభాకర్ (ప్రభు), నియోజకవర్గ అధ్యక్షులు మంద సమ్మయ్య, హైదరాబాద్ మండల ఇన్చార్జ్ రామ్ శ్రీనివాస్, మండల అధ్యక్షులు కండే తిరుపతి, పట్టణ అధ్యక్షులు గరవేణ శ్రీకాంత్, మామిండ్ల మల్లయ్య, మీడియా ఇన్చార్జ్ మంద జగన్, బీసీ ఆజాది ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు చిలకమర్రి శ్రీనివాస్, అంబేద్కర్ సంఘం నాయకులు మాడుగుల ఓదెలు, తునికి సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

# నవ వధువుకు పుస్తెమట్టెలకు పది వేలుఅందజేసిన పిఏపీఎస్ చైర్మన్

– వెంకట్రాంరెడ్డి సర్పంచ్ మమత నరసింహ యాదవ్

**కరపత్రం ప్రతినిధి వెల్దుర్తి మాసాయిపేట ఏప్రిల్ 7**
మెదక్ జిల్లా నర్సాపూర్ నియోజకవర్గంలో శివంపేట మండలం గుండ్లపల్లి గ్రామ నీకు చెందినచాకలి రమేష్ మల్లిక వివాహానికి పుస్తె మట్టెలకు 10000 రూపాయల ఆర్థిక సాయం చేసిన పిఏసిఎస్ చైర్మన్ చింతల వెంకట్రాంరెడ్డి గుండ్లపల్లి సర్పంచ్ పెంజర్ల మమత నరసింహ యాదవ్ లు అందజేశామని తెలిపారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వివాహం బంధం భగవంతుడు ఎవరికి ఎవరు అనే సంబంధాన్ని మన పుట్టుకతోనే రాసి భూ లోకంలో కి జన్మింప చేస్తాడు అలాంటి వివాహ బంధాన్ని అందరం



భార్యాభర్తల ఎలాంటి గొడవలకు తావివ్వకుండా భార్యాభర్తల బంధుత్వాన్ని అర్థం చేసుకుని కలిసిమెలిసి ఉండాలని అలజడులకు తావివ్వకుండా సంసారం అనే సాగర తీరాన్ని ఈదుకుంటూ ముందుకు వెళ్లాలని కోరుకుంటున్నామని ఏడడుగుల సంబంధాన్ని అమావాస్య చంద్రుని లాగా కాకుండా పున్నమి చంద్రుల సంసారం సజావుగా సాగాలని వారిని దీవిస్తున్నామని తెలియజేశారు ఈకార్యక్రమంలో ఉప సర్పంచ్ సత్యనారాయణ ముదిరాజ్ వార్డ్ మెంబర్స్ సదానందం ముదిరాజ్ మస్కూరి పరుశురాం ముదిరాజ్ ఉప్పునూతల సత్యనారాయణ గౌడ్ దత్తాత్రేయ గౌడ్ బజారి శ్రీనివాస్ రెడ్డి ఎలుకంటి వినోద్ కుమార్ బోళ్ల మహేష్ గడ్డం శంకర్ ఎల్క ప్రభాకర్ రెడ్డి ఉప్పునూతల శివ గౌడ్ ఎండి ఖాదర్ బాషా బజారి కృష్ణారెడ్డి బోల సిద్ధు ఎలుకంటి వెంకటేష్ సట్టి విట్టల్ గ్రామస్తులు పాల్గొన్నారు

# మల్లికార్జున స్వామి దేవస్థానానికి విరాళాల వెల్లువ దాతల సహకారంతో మరింత అభివృద్ధి



**కరపత్రం ప్రతినిధి భీమదేవరపల్లి;**
హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలంలోని ముల్కనూర్ శ్రీ మల్లికార్జున స్వామి దేవస్థాన నిర్మాణంలో భాగంగా దాతల సహకారంతో మరింత అభివృద్ధి తో ముందుకు సాగుతుంది. దేవస్థాన ఆవరణలో నెలకొల్పే గొల్ల కేతమ్మ దేవతకు జక్కుల సరోజన మొగిలి దంపతులు పుస్తె, మట్టెలు మరియు బలిజ మేడలమ్మ దేవతకు గిరబోయిన స్వరూప కుమారస్వామి దంపతులు పుస్తె ,మట్టెలు బుధవారం అందించారు. వీరితోపాటు దొండవాణి మల్లయ్య దంపతులు మల్లికార్జున స్వామి కిరీటం, శ్రీకృష్ణుని విగ్రహం ఏర్పాటుకు జక్కుల యాదమ్మ ప్రకాశం దంపతులు50116 రూపాయలు విరాళంగా అందించారు. శ్రీ మల్లికార్జున దేవస్థానం నిర్మాణానికి సహకారం అందిస్తున్న దాతలకు దేవస్థాన కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# మహిళలకు కుట్టుమిషన్ నైపుణ్య శిక్షణ - ఉపాధి దిశగా బలమైన అడుగు

**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట ఏప్రిల్ 7**
జమ్మికుంట: మహిళల ఆర్థిక స్వావలంబనను పెంపొందించేందుకు జమ్మికుంట మున్సిపల్ పరిధిలో ఉచిత కుట్టుమిషన్ నైపుణ్య శిక్షణ కార్యక్రమం ఘనంగా ప్రారంభమైంది. జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్, మెప్మా పిడి స్వరూప రాణి, కమిషనర్ మహమ్మద్ అయాజ్ ఆదేశాల మేరకు ఈ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.





మంగళవారం కార్తికేయ ఇనిస్టిట్యూట్‌లో ప్రారంభమైన ఈ శిక్షణ కార్యక్రమంలో ఇనిస్టిట్యూట్ చైర్మన్ శరత్ కుమార్, మెప్మా ఇంచార్జ్ టి.ఎం.సి మల్లేశ్వరి మాట్లాడుతూ---రాష్ట్ర ప్రభుత్వం మహిళల సాధికారతకు ప్రాధాన్యత ఇస్తూ సంఘ సభ్యులకు ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంతో ఇటువంటి కార్యక్రమాలు చేపడుతోందని తెలిపారు. మహిళలు ఇంటి వద్దే టైలరింగ్ పనులు చేసుకుంటూ ఆదాయం పొందగలరని, ఈ శిక్షణ ద్వారా వారి నైపుణ్యాలు మరింత మెరుగుపడి స్వయం ఉపాధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు.ఈ శిక్షణలో మొత్తం 41 మంది మహిళా సంఘ సభ్యులు పాల్గొంటున్నారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నాలుగు రోజుల పాటు కొనసాగనున్న ఈ కార్యక్రమంలో కుట్టుమిషన్ వినియోగం, డ్రెస్ డిజైనింగ్, కటింగ్, ఫినిషింగ్ వంటి అంశాలపై ప్రాక్టికల్‌గా శిక్షణ ఇస్తున్నారు. శిక్షణ అనంతరం మహిళలు స్వయం ఉపాధి దిశగా ముందుకు వెళ్లేందుకు మార్గదర్శకత్వం కూడా కల్పించనున్నారు.శిక్షణ నిర్వాహకురాలు సాధన మాట్లాడుతూ---ప్రస్తుత కాలంలో టైలరింగ్‌కు మంచి డిమాండ్ ఉందని, తక్కువ పెట్టుబడితో ఇంటి వద్దే వ్యాపారం ప్రారంభించే అవకాశం మహిళలకు ఉందని అన్నారు. మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా బలపడాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మెప్మా సి.ఎల్.అర్పిలు జ్యోతి, మంజుల తదితరులు పాల్గొన్నారు. పాల్గొన్న మహిళలు ఈ శిక్షణ తమకు ఎంతో ఉపయోగకరంగా ఉందని, భవిష్యత్తులో స్వంతంగా టైలరింగ్ కేంద్రాలు ప్రారంభించేందుకు ఇది దోహదపడుతుందని ఆనందం వ్యక్తం చేశారు.

# హిందూ సమ్మేళన గోడ ప్రతిని ఆవిష్కరణ... ఐక్యతతో విజయవంతం చేయాలని పిలుపు

**కరపత్రం ప్రతినిధి తిమ్మాపూర్, ఏప్రిల్ 7:**
తిమ్మాపూర్ మండలం పర్లపల్లి ఉప మండలం నల్లగొండ గ్రామంలోని శ్రీ సీతారామ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ప్రాంగణంలో ఈ నెల 11న జరగనున్న హిందూ సమ్మేళనానికి సంబంధించి గోడ ప్రతిని మంగళవారం సాయంత్రం ఘనంగా ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో సామాజిక సమరత తెలంగాణ ప్రాంత సభ్యులు పుల్లూరి రామారావు, హిందూ సమ్మేళన నిర్వహణ సమితి బాధ్యులు పాల్గొని పోస్టర్‌ను విడుదల చేసి మాట్లాడారు. ఈ నెల 11న నిర్వహించబోయే హిందూ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ---దేశానికి ఆత్మ హిందూ ధర్మమని, హిందూ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుతూ సమాజాన్ని చైతన్యవంతం చేసి ఐక్యంగా ముందుకు నడిపించడమే హిందూ సమ్మేళన ప్రధాన లక్ష్యమని తెలిపారు. ప్రస్తుతం హిందూ సమాజం ఎదుర్కొంటున్న వివిధ సవాళ్లను అధిగమించేందుకు ఐకమత్యంతో ముందుకు సాగాల్సిన అవసరం ఉందన్నారు.ప్రతి హిందువులో ఆత్మవిశ్వాసం పెంపొందించడం, సమాజంలో ఐక్యతను బలోపేతం చేయడం, దేవాలయ వ్యవస్థను పటిష్టం చేయడం, సామాజిక సమరతను నెలకొల్పడం, కుటుంబ విలువలను కాపాడడం, స్వదేశీ వస్తువుల వినియోగాన్ని ప్రోత్సహించడం, జాతీయ భావాన్ని పెంపొందించడం వంటి ముఖ్య ఉద్దేశాలతో ఈ హిందూ సమ్మేళనాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో సామాజిక సమరత తెలంగాణ ప్రాంత సభ్యులు పుల్లూరి రామారావు, హిందూ సమ్మేళన నిర్వహణ సమితి అధ్యక్షులు బోనాల మోహన్, ప్రధాన కార్యదర్శి బుర్ర శ్రీనివాస్ గౌడ్, చింతం శ్రీనివాస్, తిరుపతి రెడ్డి, కొయ్యడ శ్రీనివాస్, ఓదెలు తదితరులు పాల్గొన్నారు. ముఖ్య అతిథులుగా నల్లగొండ గ్రామ సర్పంచ్ జినుక మారత్, పర్లపల్లి గ్రామ సర్పంచ్ సూరం స్వప్న మహేందర్ రెడ్డి, మట్టపల్లి గ్రామ సర్పంచ్ గాండ్ల శ్రీనివాస్, మల్లాపూర్ గ్రామ సర్పంచ్ మామిడి మమత సతీష్ పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.






# బ్రహ్మోత్సవాలను విజయవంతం చేసిన అధికారులకు కృతజ్ఞతలు

**-- ఆలయ చైర్మెన్ ఇంగిలే రామారావు**



**కరపత్రం ప్రతినిధి ఇల్లందకుంట ఏప్రిల్ 7**
కరీంనగర్ జిల్లా ఇల్లందకుంట మండల కేంద్రంలో శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా, భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా ముగియడంతో ఆలయ చైర్మెన్ ఇంగిలే రామారావు సంతోషం వ్యక్తం చేశారు. దాదాపు 13 రోజుల పాటు నిరంతరంగా నిర్వహించిన ఈ మహోత్సవాలలో వేలాది మంది భక్తులు పాల్గొని స్వామివారి దర్శనం చేసుకోవడం విశేషం. ఈ భారీ కార్యక్రమాన్ని ఎలాంటి ఆటంకాలు లేకుండా సాఫల్యంగా పూర్తి చేయడంలో సహకరించిన ప్రతి ఒక్కరికి ఆయన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ---జమ్మికుంట పట్టణం పరిసర ప్రాంతాలకు చెందిన కాటన్ మిల్లర్స్, పారాబోయిల్డ్ రైస్ మిల్లర్స్, రా రైస్ మిల్లర్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమాలు భక్తులకు ఎంతో ఉపశమనాన్ని కలిగించాయని పేర్కొన్నారు. వేడెక్కిన వేసవిలో కూడా భక్తులకు నిరంతరం అన్నప్రసాదం, తాగునీరు అందించడం గొప్ప సేవ అని కొనియాడారు. అలాగే జిల్లా యంత్రాంగం సమన్వయంతో పనిచేసి అన్ని ఏర్పాట్లను సమర్థవంతంగా అమలు చేయడం అభినందనీయమని అన్నారు. పోలీస్ శాఖ భద్రతా పరంగా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా జాగ్రత్తలు తీసుకోవడం వల్లే కార్యక్రమం ప్రశాంతంగా జరిగిందని తెలిపారు. ఆర్ అండ్ బి శాఖ రహదారి సౌకర్యాలను మెరుగుపరచగా, ఆరోగ్యశాఖ వైద్య శిబిరాలు, అంబులెన్స్ సేవలు అందిస్తూ అప్రమత్తంగా వ్యవహరించిందన్నారు.
ఆర్టీసీ యాజమాన్యం ప్రత్యేక బస్సులను నడిపి భక్తుల రాకపోకలకు సౌకర్యం కల్పించగా, రెవెన్యూ శాఖ సమన్వయంతో అనేక ఏర్పాట్లు జరిగాయని వివరించారు. 108 అత్యవసర సేవలు, మున్సిపాలిటీ అధికారులు, పారిశుద్ధ కార్మికులు రాత్రింబవళ్లు కష్టపడి పరిశుభ్రతను కాపాడడం ద్వారా భక్తులకు సౌకర్యవంతమైన వాతావరణం కల్పించారని ప్రశంసించారు. అలాగే 18 గ్రామాల గ్రామపంచాయతీ సిబ్బంది, దేవస్థానం అధికారులు, అర్చకులు, సిబ్బంది తమ తమ బాధ్యతలను అంకితభావంతో నిర్వర్తించారని తెలిపారు.
ప్రింట్ మరియు ఎలక్ట్రానిక్ మీడియా మిత్రులు ఈ మహోత్సవాలను ప్రజలకు విస్తృతంగా చేరవేయడంలో కీలక పాత్ర పోషించారని అన్నారు. వారి సహకారం వల్లే బ్రహ్మోత్సవాలకు మరింత ప్రచారం లభించిందని పేర్కొన్నారు.
ముఖ్యంగా, పోలీస్ శాఖ అధికారులు మరియు సిబ్బంది కుటుంబ సభ్యులు కూడా వారి సేవకు సహకరించారని గుర్తుచేస్తూ, వారందరికీ శ్రీ సీతారామచంద్ర స్వామి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. ఈ బ్రహ్మోత్సవాలు భక్తుల హృదయాల్లో చిరస్మరణీయంగా నిలిచే విధంగా నిర్వహించడం అందరి సమిష్టి కృషి ఫలితమని అన్నారు.
ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మెన్ ఇంగిలే రామారావుతో పాటు ధర్మకర్తలు గోలి కిరణ్, గోడిశాల పరమేష్, కారింగుల రాజేందర్, సింగిరెడ్డి గోపాల్, కురిమిండ్ల చిరంజీవి, ఎడ్ల కిషన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి కార్యక్రమాలను మరింత విస్తృతంగా, భక్తులకు అనుకూలంగా నిర్వహించేందుకు కృషి చేస్తామని వారు తెలిపారు.

# ప్రపంచ ఆరోగ్య దినోత్సవ అవగాహన ర్యాలీ ఘనంగా నిర్వహణ

**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట ఏప్రిల్ 7**
ప్రజాపాలన--ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని వావిలాల గ్రామంలో అవగాహన ర్యాలీ ఘనంగా నిర్వహించారు. వావిలాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ వరుణ, గ్రామ సర్పంచ్ కొండ అర్జున్ కలిసి సెయింట్ మేరీ పాఠశాల విద్యార్థులతో ఈ ర్యాలీని ప్రారంభించారు.గ్రామ వీధుల గుండా సాగిన ఈ ర్యాలీలో విద్యార్థులు ఆరోగ్యంపై ప్రజలకు చైతన్యం కల్పిస్తూ పలు నినాదాలు చేశారు. "అందరి ఆరోగ్యం మనందరి బాధ్యత", "ఆరోగ్యపు అలవాట్లు సిరిసంపదకు తొలి మెట్లు", "నేటి ఆడపిల్ల రేపటి తల్లి", "వ్యాధి నిరోధక టీకాలు పిల్లల పాలిట వరాలు", "బాల్య వివాహాలు నేరాలు", "వడదెబ్బ నుంచి జాగ్రత్త", "సిగరెట్ ఆరోగ్యానికి హానికరం", "సురక్షితమైన తాగునీరు -- ఆరోగ్యానికి ఆధారం" వంటి నినాదాలతో గ్రామ ప్రజలను అప్రమత్తం చేశారు.ఈ సందర్భంగా డాక్టర్ వరుణ, హెల్త్ ఎడ్యుకేటర్ అడిదెల మోహన్ రెడ్డి మాట్లాడుతూ ప్రజల్లో





ఆరోగ్యకర జీవనశైలి అలవాట్లపై అవగాహన పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. శారీరక, మానసిక ఆరోగ్యం, పరిశుభ్రత, పౌష్టికాహారం, క్రమమైన వ్యాయామం, తక్కువ ఉప్పు వినియోగం వంటి అంశాలు ఆరోగ్యవంతమైన జీవనానికి కీలకమని తెలిపారు. వ్యాధుల నివారణకు ముందస్తు జాగ్రత్తలు అత్యంత ముఖ్యమని, ఆరోగ్యమే మహాభాగ్యం అనే భావనను ప్రతి ఒక్కరూ ఆచరణలో పెట్టాలని పిలుపునిచ్చారు.ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని 12 ఉపకేంద్రాల్లో కూడా వైద్య సిబ్బంది ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శారీరక, మానసిక, సామాజిక శ్రేయస్సును పెంపొందించడం ద్వారానే ఆరోగ్యవంతమైన సమాజం నిర్మాణం సాధ్యమని పేర్కొన్నారు.
ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ చేపూరి సతీష్, హెల్త్ సూపర్వైజర్ అరుణ, ప్రిన్సిపాల్ సిద్దూ జర్జ్, బీనా, ఫార్మాసిస్ట్ రాజశ్రీధర్ రావు, నర్సింగ్ ఆఫీసర్ సాయికుమార్, అంగన్వాడీ టీచర్లు రేష్మ, సుమలత, మణి, రమ, పుష్పలత, మల్లేశ్వరి, లక్ష్మి, ఆశా కార్యకర్తలు, విద్యార్థులు మరియు ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# నేరాల నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు

**- సీపీ అంబర్ కిషోర్ ఝా**
**- పెండింగ్ కేసులపై సమగ్ర సమీక్ష**
**- వేగవంతమైన దర్యాప్తుకు ఆదేశాలు**

**కరపత్రం ప్రతినిధి గోదావరిఖని ఏప్రిల్ 07:**
రామగుండం పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో పోలీస్ అధికారుల నేర సమీక్షా సమావేశం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశంలో పెండింగ్ కేసులు, నిందితుల అరెస్టులు, దర్యాప్తులో ఉన్న కేసులు, వారెంట్ల అమలు, పోలీస్ సిబ్బంది పనితీరును సమగ్రంగా సమీక్షించారు. ఇప్పటివరకు నమోదైన కేసులు, పెండింగ్‌లో ఉన్న పాత కేసులపై సీపీ ప్రత్యేకంగా దృష్టి సారించారు. దర్యాప్తులో జాప్యానికి గల కారణాలను అధికారులను అడిగి తెలుసుకుని తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బాధితులకు న్యాయం త్వరితగతిన అందేలా న్యాయాధికారులతో సమన్వయం పాటించాలని సూచించారు. దొంగతనాల నివారణ, కేసుల ఛేదనపై సమీక్షిస్తూ, నేరస్తులను పట్టుకోవడంలో ఆధునిక సాంకేతికతను వినియోగించాలని ఆదేశించారు.



రికవరీ శాతం పెంచి బాధితులకు వారి సొత్తును తిరిగి అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. చోరీలకు పాల్పడే వ్యక్తులపై హిస్టరీ షీట్లు తెరవాలని తెలిపారు. చోరీలు జరిగే ప్రాంతాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని, ప్రజల భాగస్వామ్యంతో గ్రామాలు, కాలనీలు, వ్యాపార సముదాయాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు చేపట్టాలని సూచించారు. ఇప్పటికే ఏర్పాటు చేసిన కెమెరాల పనితీరును స్టేషన్ అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రమాదాలకు గురయ్యే ప్రాంతాలను (బ్లాక్ స్పాట్స్) గుర్తించి సంబంధిత శాఖలతో సమన్వయం పాటిస్తూ నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్ఠాత్మక "అరైవ్-అలైవ్" కార్యక్రమం ద్వారా ట్రాఫిక్ నిబంధనలపై ప్రజల్లో అవగాహన పెంచాలని పేర్కొన్నారు. మహిళలు, చిన్నారులు, వృద్ధుల భద్రత విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. పోలీస్ స్టేషన్లకు వచ్చే ప్రజలతో మర్యాదగా వ్యవహరించి, వారి ఫిర్యాదులపై తక్షణ స్పందన ఇవ్వాలని ఆదేశించారు. పెట్రోలింగ్, బ్లూ కోల్ట్స్ వాహనాలతో పోలీసులు ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. గంజాయి వంటి మత్తు పదార్థాలు, జూదం మరియు ఇతర అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో మంచిర్యాల డీసీపీ ఏ.భాస్కర్,పెద్దపల్లి డీసీపీ బి.రామ్ రెడ్డి, అడిషనల్ డీసీపీ (అడ్మిన్) కె.శ్రీనివాస్, గోదావరిఖని ఏసీపీ ఎం.రమేష్, మంచిర్యాల ఏసీపీ ఆర్.ప్రకాష్, జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు, బెల్లంపల్లి ఏసీపీ కిరణ్ కుమార్, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ నాగేంద్ర గౌడ్, ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాస్, సీఐలు, ఇన్స్పెక్టర్లు,ఎస్ఐలు పాల్గొన్నారు.

# ప్రణవ్ ఆధ్వర్యంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావును కలిసిన డంప్ యార్డ్ జేఏసీ, మున్సిపల్ పాలకవర్గం

**కరపత్రం ప్రతినిధి హుజూరాబాద్ ఏప్రిల్ 7**
హుజూరాబాద్ ప్రాంత ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలన్న లక్ష్యంతో డంప్ యార్డ్ తరలింపుపై ఉద్యమం వేగం పెరుగుతోంది. ఈ నేపథ్యంలో హుజూరాబాద్ డంప్ యార్డ్ జేఏసీ నాయకులు, మున్సిపల్ పాలకవర్గం మంగళవారం సెక్రటేరియట్‌లో జిల్లా ఇంచార్జి మంత్రి తుమ్మల నాగేశ్వరరావును కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సమావేశం హుజూరాబాద్ కాంగ్రెస్ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ ఆధ్వర్యంలో జరిగింది.
ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ, వెస్ట్ టు ఎనర్జీ ప్లాంట్ కారణంగా హుజూరాబాద్, సిర్సపల్లి ప్రాంతాలు తీవ్ర కాలుష్యానికి గురయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే సారవంతమైన వ్యవసాయ భూములు కలిగిన ఈ ప్రాంతం పర్యావరణ దెబ్బతినే పరిస్థితి





నెలకొంటుందని, ప్రజల ఆరోగ్యం కూడా ప్రమాదంలో పడుతుందని వివరించారు. డంప్ యార్డును ప్రస్తుత ప్రదేశం నుండి వెంటనే తరలించాలని, భవిష్యత్ తరాల దృష్ట్యా సరైన నిర్ణయం తీసుకోవాలని మంత్రిని కోరారు. ఈ విషయంపై ఇప్పటికే మున్సిపల్ పాలకవర్గం ఏకగ్రీవంగా తీర్మానం చేసి ప్రభుత్వ దృష్టికి తీసుకువచ్చిన విషయాన్ని గుర్తు చేశారు.
మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పందిస్తూ, ఈ సమస్యను ఇప్పటికే ప్రణవ్ తన దృష్టికి తీసుకువచ్చినట్లు తెలిపారు. సమస్య గంభీరతను అర్థం చేసుకున్నానని, ముఖ్యమంత్రితో చర్చించి పరిష్కారం దిశగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.ఈ సమావేశంలో హుజూరాబాద్ మున్సిపల్ చైర్పర్సన్ సుహాసిని, కౌన్సిలర్లు, జేఏసీ నాయకులు, కరీంనగర్ నియోజకవర్గ ఇంచార్జి వెలిచాల రాజేందర్ రావు, మున్సిపల్ పరిధి నాయకులు పాల్గొన్నారు.